జనావాసంలోకి అడవి జింక

కుక్కలు తరమడంతో గుడిలోకి దూరిన వైనం


మారేడుమిల్లి గంగాలమ్మ గుడిలో ఉన్న జింక

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: పర్యటక కేంద్రం మారేడుమిల్లి పరిసరాల్లో అటవీ ప్రాంతం నుంచి ఓ అడవి జింక బుధవారం దారి తప్పి, గ్రామంలోకి ప్రవేశించింది. దీనిని గమనించిన కుక్కలు తరుముకుంటూ రావడంతో వాటి నుంచి తప్పించుకునే క్రమంలో స్థానిక పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న మాతృశ్రీ కనకవర్షిణి గంగాలమ్మ ఆలయంలోకి ప్రవేశించింది. దీన్ని గమనించిన స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. హుటాహుటిన గ్రామానికి వచ్చిన అటవీశాఖ అధికారులు జింకను పరిశీలించి, దాని మెడపై గాయాలు ఉండటంతో పశు వైద్యశాలకు తరలించి, వైద్యసేవలు అందించారు. అనంతరం తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అటవీ శాఖ సిబ్బంది దీన్ని సంరక్షించనున్నారు.

కూటమి ప్రభుత్వంపైనే కోటి ఆశలు

పోలవరం ఆనకట్ట నిర్మాణంపై కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది.

అయిదేళ్లుగా నత్తను తలపించిన పనులను పరుగులు పెట్టిస్తోంది. కేంద్రం కూడా ఆర్థికంగా అండదండలు అందిస్తుండటంతో పనుల్లో వేగం పెరిగింది.

ఆనకట్ట నిర్మాణంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్చలు జరుపుతున్న నేపథ్యంలో నిర్వాసితులు కోటి ఆశలు పెంచుకున్నారు.

గత పదేళ్లుగా పడుతున్న వరద కష్టాల నుంచి గట్టెక్కుతామని ఆశిస్తున్నారు.

–ఈనాడు, రంపచోడవరం, న్యూస్‌టుడే, కూనవరం


గోదావరి వరదలకు పూర్తిగా మునిగిన టేకులబోరు గ్రామం

పోలవరం ఆనకట్టలో ప్రధానంగా నష్టపోతున్నవి జిల్లాలోని కూనవరం, వరరామచంద్రాపురం, చింతూరు, ఎటపాక మండలాలు. కూనవరం, వరరామచంద్రాపురం మండలాలు దాదాపుగా వంద శాతం నష్టపోతుండగా చింతూరు, ఎటపాక మండలాలు పాక్షికంగా నష్టపోతున్నాయి. 2006లో మొదలైన పోలవరం భూ సేకరణలో ఎక్కువమంది రైతులు తమ భూములను ప్రభుత్వానికి ఎకరా కేవలం రూ. 1.15 లక్షలకే ఇచ్చారు. అనంతరం 2013 భూసేకరణ చట్టం రావడంతో ఆ భూమి ధరలు ఎకరా రూ. 10.50 లక్షలకు పెరిగింది. ఒకే ప్రాజెక్టు కింద ఒకే ప్రాంతంలో భూములు కోల్పోయిన వారికి ఏడేళ్లలో దాదాపు పది రెట్లు పెరగడంతో గతంలో భూములు ఇచ్చిన రైతులు గగ్గోలు పెడుతున్నారు. గతంలో భూములు ఇచ్చిన రైతులకు ఎకరానంగా రూ. అయిదు లక్షలు ఇస్తామని 2019 ఎన్నికల ప్రచారంలో చెప్పిన వైకాపా అధినేత జగన్ ఆ హామీని నెరవేర్చకుండానే అయిదేళ్లు గడిపారు.


వరదలకు పిల్లలతో అడవుల్లో తలదాచుకున్న గిరిజన నిర్వాసితులు

వరదలకు విలవిల

పోలవరం ఆనకట్ట నిర్మాణంలో ముంపు గ్రామాలను రెండు కాంటూర్లుగా విభజించారు. 41.15 కాంటూరులో కొన్ని, 45.75 కాంటూరులో మిగిలిన గ్రామాలున్నాయి. రాష్ట్ర విభజన తరువాత తెదేపా ప్రభుత్వం అయిదేళ్ల కాల వ్యవధిలోనే 72 శాతం నిర్మాణం పూర్తిచేసింది. ఈ పనులు తుదిదశకు చేరుతున్న క్రమంలో 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెదేపా ఓడిపోయి వైకాపా పాలనలోకి వచ్చింది. అప్పటి నుంచి ఆనకట్ట పనులతోపాటు పునరావాస పనులు మందకొడిగా సాగుతున్నాయి. రెండు, మూడేళ్లకో వచ్చే గోదావరి వరదలు కాపర్ డ్యామ్ వల్ల బ్యాక్ వాటర్ ప్రభావంతో ఏడాదికి రెండు, మూడుసార్లు వస్తున్నాయి. దీంతో ముంపు మండలాల ప్రజలు ప్రతి ఏటా జులై నుంచి సెప్టెంబర్ వరకు నిర్వాసితులు భయం గుప్పిట్లో కాలం గడుపుతున్నారు. కష్టపడి సంపాదించుకున్నది ప్రతిఏటా వరదపాలవడం నిర్వాసితులను కుంగదీస్తోంది.

రాడార్ సర్వేతో కొత్త గ్రామాల గుర్తింపు

ముందుగా గుర్తించిన ముంపు గ్రామాల్లో కూనవరం నుంచి ఒక్క గ్రామమే ఉండగా.. వరరామచంద్రాపురం, చింతూరు మండలాల్లోనూ కొన్ని గ్రామాలే నమోదవడం వాస్తవ పరిస్థితులకు భిన్నంగా ఉంది. దీంతో నిర్వాసితుల అభ్యర్థన మేరకు రాడార్ సర్వే నిర్వహించారు. వరదలకు ముందుగా దెబ్బతింటున్న 30 గ్రామాలను కొత్తగా గుర్తించారు. ఏడాదిలో పరిహారాలు అందించి ఖాళీ చేయిస్తామంటూ అప్పటి పాలకులు హడావుడి చేసినా కార్యాచరణకు నోచుకోలేదు.

రెండున్నరేళ్లలో సాధ్యమేనా?

ముంపు గ్రామాల్లో ఇప్పటికే అన్ని సర్వేలు పూర్తయ్యాయి. వాటి విలువలు కట్టి అధికారులు జాబితాలు సిద్ధం చేశారు. నిర్వాసితులకు పరిహారాలు ఇవ్వడం సులభమే అయినా.. అసలు సమస్య పునరావాసం, భూమికి భూమి ఇవ్వడంలోనే ఉంది. 41.15 కాంటూరులోని గ్రామాలే కాకుండా రాడార్ సర్వేతో గుర్తించి 30 కొత్త గ్రామాలకు పునరావాసం చూపించాల్సి ఉంది. ఇప్పటికీ పాతవారికే పూర్తి స్థాయి పునరావాసం అందలేదు. కొత్తగా గుర్తించిన గ్రామాలకు రానున్న రెండున్నరేళ్లలో పరిహారాలు, పునరావాసం, భూమికి భూమి ఇస్తేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తుది లక్ష్యం నెరవేరుతుంది. ఇప్పటి వరకు కొత్త గ్రామాలకు పునరావాసానికి సంబంధించి భూములే గుర్తించలేదు. పునరావాసం కోసం నిర్వాసితుల అభిప్రాయం తీసుకోలేదు. గిరిజన రైతులకు భూమికి భూమి ఇవ్వాల్సి ఉంది. వారికి పునరావాసం ఇచ్చిన ప్రాంతంలోనే సాగు భూములు ఇవ్వాల్సి ఉంది. ఒక్క కూనవరం మండలానికే భూమికి భూమి ఇవ్వాలంటే సుమారు వెయ్యి ఎకరాలను ప్రభుత్వం సిద్ధం చేయాలి. నిర్వాసితులకు న్యాయం చేసి తరలిస్తామని చెబుతున్న పాలకులు పక్కా ప్రణాళిక ప్రకారం చేస్తేనే వీటన్నింటినీ రానున్న రెండున్నరేళ్లలో చేయగలరు.

రాడార్ సర్వేలో గుర్తించిన గ్రామాలు

మండలం	గ్రామాలు	నిర్వాసిత కుటుంబాలు
కూనవరం	09	3935
వీఆర్‌పురం	16	5080
చింతూరు	05	3454

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: వ్యాపారులు తూకంలో మోసాలకు పాల్పడినా, అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని తూనికలు, కొలతల విభాగం ప్రాంతీయ ఇన్‌స్పెక్టర్ అనూరాధా అన్నారు. బుధవారం ఆమె ముంచంగిపుట్టు మండల కేంద్రంలోని కిరాణా, జనరల్ స్టోర్స్ దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. తూకం, కొలతల్లో నిబంధనల ఉల్లంఘనలపై ఆరు కేసులు నమోదు చేశామని ఆమె తెలిపారు. పాడేరులో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదుల మేరకు తనిఖీలు చేశామన్నారు. పాలు, పెరుగు, పన్నీరు వంటి డెయిరీ ఉత్పత్తులు, శీతల పానీయాలు అధిక ధరలకు విక్రయిస్తున్న వారిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. ఒడిశా నుంచి దిగుమతి చేసుకుని విక్రయిస్తున్న బియ్యం బస్తాల తూకం సరిగ్గా ఉన్నప్పటికీ చట్టరీత్యా ఉండాల్సిన వివరాలు ముద్రించలేదని పేర్కొన్నారు. సక్రమంగా లేని తూనిక యంత్రాలు వినియోగిస్తున్న వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు.


ముంచంగిపుట్టులో బియ్యం బరువును తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ అనూరాధ

ఆకలి తీర్చే అమ్మ.. గోమాతకు వందనమ్మ

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే



ఆ పందిపిల్ల ఆకలిమీద ఉంది. ఆకలి తీర్చుకునే మార్గం కోసం వెదుకుతున్న దానికి రోడ్డుమీద పడుకున్న ఆవు కనిపించడంతో పొదుగు దగ్గరకు వెళ్లి పాలు తాగడం మొదలెట్టింది. ఎంతైనా తల్లి మనసు కదా... జాతి ఏదైనా కావచ్చు... ఆకలి అందరికీ ఒకటే కదా అనుకుందో ఏమో గాని పందిపిల్ల పాలు తాగుతున్నంతసేపూ గోమాత సహకరించింది. అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో బాల వినాయకుడి గుడి వద్ద కనిపించిన దృశ్యమిది..

కాఫీ రైతులకు గిట్టుబాటు ధర కల్పనకు కృషి

పాడేరు, న్యూస్‌టుడే: కాఫీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఐటీడీఏ, కాఫీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అరకు కాఫీని గిరిజన రైతులు సేంద్రియ విధానంలో సాగు చేస్తున్నారని, రైతులకు మంచి ధర చెల్లించాలని స్పష్టం చేశారు. చింతపల్లి మాక్స్ సంస్థ సేకరిస్తున్న పంటను బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తామన్నారు. పంట నాణ్యతపై లైజన్ వర్కర్లకు అవగాహన కల్పించాలని చెప్పారు. చింతపల్లి మాక్స్ సంస్థ ఈ ఏడాది 600 టన్నుల పార్చిమెంట్ కాఫీని ఉత్పత్తి చేస్తోందని పేర్కొన్నారు. ఐటీడీఏ అధికారులు వాసుదేవ మూర్తి, కిరీట్ పాండే, కాఫీ బోర్డు డీడీ ఎస్ రమేష్, ఐటీడీఏ కాఫీ సహాయ సంచాలకులు ఎన్. అశోక్, ఐటీడీఏ పరిపాలనాధికారి ఎం హేమలత పాల్గొన్నారు.


సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

అక్రమ కలప స్వాధీనం

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: ఒడిశా రాష్ట్రానికి తరలించేందుకు సిద్ధంచేసిన నీలగిరి, సిల్వర్‌ఓక్, అకేసియా కలపను అరకు రేంజ్ అధికారి శ్రీనివాసరావు స్వాధీనం చేసుకున్నారు. సొవ్వా పంచాయతీ సొవ్వా, కాగువలస, మాలివలస, పనసవలస, కాగువలస, గొప్పులవలస వన సంరక్షణ సమితి పరిధిలో బుధవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. స్థానికుల ఫిర్యాదుతో ఈ దాడులు నిర్వహించారు. ఒడిశా రాష్ట్రానికి తరలించడానికి సిద్ధంగా ఉన్న కలపను పట్టుకున్నారు. అనంతరం గిరిజనులతో మాట్లాడారు. వన సంరక్షణ పరిధిలో నాటిన మొక్కలను సంరక్షించి ఫలాసాయాలు పొందాలని సూచించారు.


స్వాధీనం చేసుకున్న కలప వద్ద రేంజ్ అధికారి శ్రీనివాసరావు

పేదింట గ్యాస్ పండగ

ఒక్కొక్కరికి రూ.2,550 ఆదా


ధరల పెరుగుదలతో సామాన్య, మధ్య తరగతి ప్రజలకు వంటింటి భారం అధికమవుతోంది. కుటుంబానికి ఆధారమైనవారు మృతి చెందడంతో ఎందరో నిరుపేద మహిళలు కుటుంబాలను పోషించుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు. కూలీనాలితో బతుకులు నెట్టుకురావడానికి కొందరు అవస్థలు పడుతున్నారు. ఈ తరుణంలో కూటమి ప్రభుత్వం 'దీపావళి' నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల సరఫరాను అమలుచేసేందుకు రంగం సిద్ధం చేయడంతో ప్రతి ఇంటా ఆనందం వెల్లి విరుస్తోంది. తమ కుటుంబాల్లో వెలుగులు నింపే అసలైన దీపావళి ఇది అంటూ ఈ పథకాన్ని కొనియాడుతున్నారు.




కలెక్టరేట్, నర్సీపట్నం, పాడేరు, జీకేవీధి, న్యూస్‌టుడే

కూటమి సర్కార్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజలు మన్ననలు అందుకుంటోంది. ఇప్పటికే ఎన్టీఆర్ భరోసా పథకంలో భాగంగా పింఛన్లు పెంచింది. ఒకటో తేదీ సెలవు వస్తే ముందురోజే ఠంచన్‌గా పింఛను అందిస్తోంది. అన్న క్యాంటీన్‌లు ప్రారంభించి నిరుపేదలకు పట్టెడు అన్నం అందిస్తోంది. సూపర్ సిక్స్ పథకంలో భాగంగా మహాశక్తికి ఏటా మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా అందించడానికి కసరత్తులు ప్రారంభించింది. దీపావళి నుంచి మహిళలకు ఉచితంగా ఏటా మూడు గ్యాస్ సిలెండర్లు అందిస్తామని చెప్పడంతో మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నెల బడ్జెట్‌లో గ్యాస్ భారం నుంచి ఉపశమనం పొందనున్నారు.

అనకాపల్లి జిల్లాలో 24 గ్యాస్ ఏజెన్సీల పరిధిలో 4,87,034 కనెక్షన్లు ఉన్నాయి. ఇవి కాకుండా ప్రభుత్వ హాస్టల్స్ 822, వాణిజ్యపరంగా 2045 ఉన్నాయి. 5,47,539 మంది కార్డుదారులు ఉన్నారు. రేషన్‌కార్డులు ప్రాతిపదికన జిల్లాలో 16,42,617 సిలెండర్లను ఏటా 5.47 లక్షల కుటుంబాలకు అందించనున్నారు. నర్సీపట్నం డివిజన్‌లో లబ్ధిదారులు లక్ష మంది వరకు ఉండొచ్చంటున్నారు. సబ్ డివిజన్ పరిధిలోని ఆరు మండలాల్లో హెచ్‌పీ, ఇండేన్, భారత్ కంపెనీల్లో 60 వేల కనెక్షన్లు ఉన్నాయి. జిల్లాలో ప్రస్తుతం గ్యాస్ సిలెండర్ ధర రూ. 850 వరకు ఉంది. దూరం బట్టి ధర పెరుగుతుంది. భార్య, భర్త, ఇద్దరు పిల్లలు ఉన్న కుటుంబంలో రెండు నెలలకో సిలెండర్ చొప్పున ఏడాదికి ఆరు అవసరం అవుతాయి. ప్రభుత్వం మూడు సిలెండర్లు ఉచితంగా అందించడానికి ముందుకు రావడంతో సగానికి పైగా ఆర్థిక భారం తగ్గిపోతుంది. ఒక్కో ఇంటికి సగటున రూ. 2,550 వరకు ఆదాకానున్నది. వంటింటి బడ్జెట్ ఖర్చు తగ్గనుండడంతో గృహిణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.





అల్లూరి జిల్లాలో కనెక్షన్ల వివరాలు

దీపం పథకం	49,857
సీఎస్‌ఆర్	9,703
ఉజ్వల	11,433
సింగిల్ కనెక్షన్లు	37,002
డబుల్ కనెక్షన్లు	24,695

ఎంతో ఊరట లభిస్తుంది



ఇటీవల నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గ్యాస్ లేకుండా వంట కాదు. ఏటా రూ.వేలల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది. మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడం ఆనందంగా ఉంది.
– సరస్వతి, ఐటీడీఏ రేకులకాలనీ

పథకంతో ఎంతో ప్రయోజనం



పింఛను సొమ్ముతోనే జీవిస్తున్న నాకు ఈ పథకంతో ఎంతో ప్రయోజనం చేకూరనుంది. ఇటీవల భర్త మృతి చెందాడు. ఏ ఆధారం లేక నానా అవస్థలు పడుతున్నాను. మొన్నటి వరకు మెప్మాలో పని చేసేదానిని. ఆ ఉద్యోగం సైతం ఇప్పుడు లేదు. గ్యాస్ సిలిండర్లకు సొమ్ము చెల్లించడం చాలా కష్టమవుతోంది. ఈ పరిస్థితిలో ప్రభుత్వం బండలను ఉచితంగానే ఇవ్వడానికి సిద్ధం కావడం ఎంతో ఆనందంగా ఉంది. – పెట్ల వరలక్ష్మి, నర్సీపట్నం

చాలీచాలని జీతంతోనే పోషణ



ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తున్నాను. భర్తకు ఇటీవల ఉద్యోగం పోయింది. మార్కెట్‌లో అన్ని ధరలు చుక్కలనంటుతున్నాయి. చాలీచాలని జీతంతో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువవుతున్నాయి. ఉచిత సిలిండర్లతో మిగిలే డబ్బులతో కుటుంబ అవసరాలు గట్టెక్కే అవకాశం ఉంటుంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ ముందుకెళ్లడం హర్షణీయం. – బైలపూడి శ్యామల, పెద బొడ్డేపల్లి

మార్గదర్శకాలు రావాల్సి ఉంది

ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి సంబంధించి మార్గదర్శకాలు రావాల్సి ఉంది. ఎప్పుడు వచ్చినా పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. అందుకు అవసరమైన సమాచారం, చర్యలు తీసుకుంటున్నాం.
– గణేష్‌కుమార్, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి

రెండు చుక్కలతో చెక్ పెట్టేద్దాం!



పాడేరు, అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

నేడు వరల్డ్ పోలియో డే

పోలియోను దేశం నుంచి తరిమేయాలని చేపట్టిన ప్రచారం మంచి ఫలితాన్ని ఇచ్చింది. దేశవ్యాప్తంగా పోలియో కేసులు సున్నాకు చేరడంతో పోలియోరహిత దేశంగా ప్రకటించాలనుకుంటున్న సమయంలో పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లో కేసులు రావడం భయాందోళనలు కలిగించింది. ఈ నేపథ్యంలో మిషన్ ఇంద్రధనస్సు పేరుతో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా సర్వే చేపట్టింది. జిల్లాలో నవంబరు 1 నుంచి 15వ తేదీలోగా ఈ ఇంటింటా సర్వే ప్రారంభం కానుంది.




కృష్ణదేవిపేటలో పోలియో చుక్కలు వేయడానికి నీటిలో వెళ్తున్న ఉద్యోగిని

పోలియో మహమ్మారి ఒకప్పుడు అందరినీ వేధించేది. అంగవైకల్యానికి దారితీసే ఈ వైరస్‌ను నిర్మూలించడానికి పోలియో చుక్కలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చి అందరికీ ఉచితంగా అందించింది. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు వరకు ఏడాదిలో రెండు విడతల్లో పోలియో చుక్కలను వేసేలా వైద్య సిబ్బంది ప్రత్యేక చొరవ చూపుతున్నారు. జిల్లా, ఏరియా ఆసుపత్రులతో పాటు సీహెచ్‌సీలు, పీహెచ్‌సీల వైద్య సిబ్బంది సహకారంతో పోలియోను సమూలంగా నిర్మూలించేలా ప్రభుత్వం, వైద్య సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకుంది.

సముద్ర తీర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి.. పొరుగు దేశాల్లో పోలియో కేసులు రావడంతో మన దేశంలోని తీర ప్రాంతాల్లో నివసించే జనవాసాలపై దృష్టి సారిస్తున్నారు. చిన్న పిల్లలకు జ్వరం, వాంతులతో పాటు నడవడానికి ఇబ్బందులు పడుతున్న వారు ఎవరైనా ఉన్నారా అన్నదానిపై నెలవారీ సర్వే జరుగుతోంది. టీకాల అధికారుల సమక్షంలో పరిశీలన చేస్తున్నారు. గత 15 ఏళ్లగా పోలియో కేసులు నమోదు కావడం లేదని వైద్యాధికారులు చెబుతున్నారు. జిల్లాలో ఎవరికైనా పోలియో చుక్కలు వేయలేదా అన్నదానిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కార్మికుల పిల్లల్లో అయిదేళ్లలోపు ఉన్న వారిని కూడా గుర్తించి వారికి కూడా చుక్కల మందు వేయడం వల్ల లక్ష్యాలకు మించే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

అందరి సహకారంతో నిర్మూలన: అందరి సహకారంతో పోలియోను నిర్మూలించగలిగాం. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు వరకు పోలియో చుక్కలతో పాటుగా టీకాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్నాయి. గత 15 ఏళ్లగా పోలియో కేసులు లేవు. మిషన్ ఇంద్రధనస్సులో భాగంగా నవంబరు 1 నుంచి 15 వరకు జిల్లాలో సర్వే చేపడుతున్నాం. ఎక్కడైనా పోలియో చుక్కలు వేయించుకోని చిన్నారులు ఉంటే గుర్తించి, వారికీ వేస్తాం.
– జమాల్ బాషా, జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి

ఇదీ పరిస్థితి..

ఏడాది	అయిదేళ్ల లోపు చిన్నారులు	చుక్కలు వేసింది	శాతం
2022	1,19,378	1,19,365	99.98
2023	1,20,416	1,20,518	100.08
2024	1,22,538	1,23,037	100.40


ప్రజా దర్బార్‌లో అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి, ప్రత్యేక ఉప కలెక్టర్ లక్ష్మీనారాయణ, వేదికపై తెలుగు యువత అధ్యక్షుడు మఠం భాస్కర్

మూడు నెలలకోసారి ప్రజా దర్బార్

చింతూరు, ఎటపాక న్యూస్‌టుడే: నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యల పరిష్కారానికి మూడు నెలలకోసారి అన్ని మండలాల్లో ప్రజా దర్బార్ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి వెల్లడించారు. చింతూరు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఇక్కడి వచ్చే వినతులను సంబంధిత శాఖ అధికారులకు పంపించి వారి స్థాయిలో పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ప్రకటించారు. సాంకేతిక కారణాల వల్ల కొందరి పింఛన్లు రద్దయి ఉండొచ్చని, వాటిని పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు చెప్పారు. తెలుగు యువత అధ్యక్షుడు మఠం భాస్కర్, ఎంపీడీఓ జి.మోహన్, ప్రత్యేక ఉప కలెక్టర్ లక్ష్మీనారాయణ, మండల తెదేపా అధ్యక్షుడు ఇల్లా చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఎటపాక మండలంలోని చంద్రన్న బీమా లబ్ధిదారులను ఆదుకోవాలనిమండల ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు కణితి మధు, పార్టీ నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. మండలంలో సుమారు 54 మంది మరణించగా వారి కుటుంబ సభ్యులకు నేటికి బీమా సొమ్ము చెల్లించలేదన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

రంపచోడవరంలో ఉద్యోగ మేళా 26న

రంపచోడవరం, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 26న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డాక్టరు పి.రోహిణి ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 ఏళ్ల వయస్సు లోపు పది, ఇంటర్, డిగ్రీ, డిప్లమో ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువకులు ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. డైకిన్, కేర్ ఫర్ యు కంపెనీలకు ఎంపికైన వారికి నెలకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు వేతనాలు అందిస్తారన్నారు పూర్తి వివరాలకు స్థానిక డిగ్రీ కళాశాలను సంప్రదించాలని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డి.రవికుమార్ తెలిపారు.

తప్పని డోలీమోతలు



కర్రిగుడలో గర్భిణిని డోలీమోతతో తీసుకెళ్తున్న బంధువులు

అనంతగిరి, న్యూస్‌టుడే: మన్యం ప్రాంతంలో డోలీమోతలు నిత్యకృత్యమయ్యాయి. మారుమూల గ్రామాలకు సరైన రహదారి సౌకర్యం లేని కారణంగా డోలీమోతలే దిక్కవుతున్నాయి. గుమ్మ పంచాయతీ కర్రిగుడ గ్రామానికి చెందిన కొర్రా దాలమ్మ గర్భిణి. బుధవారం ఈమెకు అనారోగ్యంగా ఉండటంతో భర్త, బంధువులు వాహనాలు వచ్చే ప్రదేశం వరకు డోలీమోతతో తీసుకెళ్లారు. అక్కడి నుంచి శృంగవరపుకోట ఆసుపత్రికి తీసుకెళ్లారు. సుమారు ఏడు మిడి కిలోమీటర్లు దూరం మోసుకెళ్లినట్లు వారు పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి రహదారి నిర్మించాలని కోరారు.



డోలీలో సన్యాసయ్యను గెడ్డ దాటిస్తున్న కుటుంబసభ్యులు

జి.మాడుగుల, న్యూస్‌టుడే: బొయితిలి పంచాయతీ తోకరిగరువు గ్రామానికి చెందిన లావేడి సన్యాసయ్య అనారోగ్యంతో బాధపడుతున్నారు. బుధవారానికి తీవ్రం కావడంతో కుటుంబసభ్యులు సుమారు నాలుగు కిలోమీటర్లు డోలీమోతతో తీసుకెళ్లారు. మార్గ మధ్యలో ఉన్న గెడ్డను దాటించేందుకు అవస్థలు పడ్డారు. మద్దిగరువు నుంచి వాహనంలో జి.మాడుగుల ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందించారు.

కొనసాగుతున్న పర్యాటకుల రద్దీ

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అరకులోయకు రద్దీ కొనసాగుతోంది. పొగమంచు కురుస్తుండటంతో తెల్లవారుజాము నుంచే సందర్శక ప్రాంతాల్లో పర్యాటకుల సందడి కనిపిస్తోంది. మాడగడ సన్‌రైజ్ పాయింట్ వద్ద బుధవారం సందర్శకుల రద్దీ వాతావరణాన్ని తలపించింది. థింసా నృత్యాలు, గిరిజన సంప్రదాయ వస్త్రధారణలతో పలువురు సందడి చేశారు. ఈ ప్రాంతం ఇటీవల వెడ్డింగ్ ఫొటోషూట్‌లకు వేదికగా మారింది.



మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్ వద్ద పర్యటకులు

ఇది ఆ దైవమే ఇచ్చిన తీర్పు!

వైకాపా ప్రభుత్వ హయాంలో ఎన్ని విమర్శలు వచ్చినా శారదా పీఠానికి కారుచౌకగా కట్టబెట్టిన భూములు.. ఎట్టకేలకు మళ్లీ ప్రభుత్వ చేతికొచ్చాయి.

కూటమి ప్రభుత్వం

- శారదాపీఠానికి భూకేటాయింపులు రద్దు
- వైకాపా హయాంలో కారుచౌకగా కొట్టేసిన వైనం
- వెనక్కి తీసుకున్న కూటమి పాలకులు

ఈనాడు, విశాఖపట్నం

నాడు కేటాయించిన 15 ఎకరాలను వెనక్కి తీసుకునే అంశానికి బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది. వైకాపా హయాంలో 'రాజగురువు' తరహా హోదా పొందిన శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి అడిగిందే తడవుగా నాడు జగన్ ఈ భూములు కేటాయించారు. తొలుత వేద విద్యకు భూములు ఇవ్వాలని కోరి ఆ తర్వాత ఆదాయ అవసరాలకు కేటాయించాలని అప్పట్లో లేఖ రాయడం తీవ్ర చర్చనీయాంశమైంది. అడిగిందే తడవుగా ఆగమేఘాలపై దస్త్రాలు కదిలాయి. అయితే.. కూటమి ప్రభుత్వం రాకతో కథ మారింది.

ఇక్కడే ఎందుకంటే...



శారదా పీఠానికి కేటాయించిన ఈ భూములు చాలా కీలకమైన ప్రాంతంలో ఉన్నాయి. ప్రసిద్ధ ఎర్రమట్టి దిబ్బలకు సమీపంలో ఉన్నాయి. అంతే కాదు..ఈ కొండపైనుంచి చూస్తే సాగర తీర అందాలు ఆకట్టుకుంటాయి. విశాఖ-భోగాపురం రహదారికి అతి సమీపంలో ఉన్నందున ఈ భూములను కేటాయించినట్లు సమాచారం.

23-10-2024 భూముల కేటాయింపు రద్దు చేస్తూ కూటమి మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం.

2021లో అప్పటి సీఎం జగన్ చినముషిడివాడలోని శారదాపీఠానికి వచ్చారు. ఆ సమయంలో భూకేటాయింపులకు సంబంధించిన అంశం సీఎం దృష్టికి తీసుకెళ్లారు.. భూమి కేటాయించాలా అధికారులను మౌఖికంగా ఆదేశించారు. ఆ తర్వాత ఈ ప్రక్రియ ఊపందుకుంది. పీఠం అనుకున్నట్టు జరిగింది.



వైకాపా ప్రభుత్వం 2022 ఆగస్టులో 343జీవోలోని బదలాయింపు ఉత్తర్వులను సవరించి ఉత్తరాధికారి పేరున భూములు కేటాయిస్తున్నట్లు కొత్తగా మరో జీవో ఇచ్చారు.

కేటాయించిన భూమి ఇదే

అధికారులు ప్రతిపాదించిన ధరకన్నా: భీమిలికి అతి సమీపంలో కొత్తవలస వద్ద విలువైన 15 ఎకరాలు నాటి వైకాపా ప్రభుత్వం కేటాయించింది. ఇక్కడ ఎకరా రూ.25 కోట్లు పలుకుతుంది. అలాంటి చోట ఎకరం రూ.లక్షకే కట్టబెట్టారు. అధికారులు చెప్పిన ధరకన్నా అతి తక్కువకే ఇచ్చేశారు.



వీఎంఆర్‌డీఏ అత్యుత్సాహం

శారదా పీఠానికి గత ప్రభుత్వం పూర్తిగా దాసోహమైందనే విమర్శలు వెల్లువెత్తాయి. ఎందుకంటే... కొత్తవలసలో స్థలం కేటాయించడంతో పాటు వృత్తాకార ఆలోచనతో ఉదారంగా రోడ్డు సదుపాయం కూడా కల్పించారు. భూకేటాయింపు ఆలోచన ప్రాథమిక దశలో ఉండగానే రోడ్డు కోసం కూడా ప్రణాళిక చేశారు. కొత్తవలస కొండ మీద పీఠానికి స్థలం కేటాయించినా అక్కడ ఎటువంటి అభివృద్ధి లేదు. అయినప్పటికీ విశాఖ మహానగరాభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) నుంచి తెరమీదికి తెచ్చి ఘాట్ రోడ్డు నిర్మించారు. ఇందుకు సుమారు రూ.2 కోట్ల ప్రజాధనం ఖర్చు చేశారు. నేరుగా శారదా పీఠానికి రోడ్డు వేస్తే విమర్శలు వస్తాయని అదే కొండ మీద వీఎంఆర్‌డీఏకు 50 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. అక్కడికి వెళ్లేందుకే ఈ రోడ్డంటూ వాయువేగంగా నిర్మించేశారు. కొండ కింద నుంచి పైకి 1.20 కిలోమీటర్ల ఘాట్ రోడ్డును 40 అడుగుల వెడల్పుతో పూర్తి చేశారు.

డిమాండ్లు పరిష్కరించకపోతే సమ్మె

చింతపల్లి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ (ఏపీఎఫ్‌డీసీ)లో దీర్ఘకాలికంగా పనిచేస్తున్న కాఫీ కార్మికుల సమస్యలు పరిష్కరించని పక్షంలో సమ్మె తప్పదని ఆ సంఘం నాయకులు బోంగి చిన్నయ్యపడాల్, సత్యనారాయణ అన్నారు. బుధవారం చింతపల్లిలో కాఫీ కార్మికుల సమావేశం జరిగింది. ఈనెల 15న పలు వినతులను సంస్థ యాజమాన్యానికి అందజేశామని తెలిపారు. ఈనెల 19న యాజమాన్యం కార్మికులతో మొక్కుబడి సమావేశం నిర్వహించి మమ అనిపించిందన్నారు. సమస్యల పరిష్కారంపై యాజమాన్యం నుంచి ఇప్పటివరకు స్పష్టమైన హామీ రాలేదని చెప్పారు. సంఘ జిల్లా అధ్యక్షురాలు కనకవల్లి, నాయకులు గిరి, పాపారావు, వెంకటేష్, శివ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న కాఫీ కార్మిక సంఘం నాయకులు

మరదలిపై అత్యాచారం కేసులో నిందితుడి అరెస్ట్

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలిలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని బుధవారం అరెస్ట్ చేశామని పరవాడ డీఎస్పీ కె.సత్యనారాయణ చెప్పారు. బుధవారం రాత్రి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం రాత్రి బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. నిందితుడు నేరాన్ని అంగీకరించాడన్నారు. పెద్దల సమక్షంల్లో అతని ఇంటి వద్దే నిందితుడిని అరెస్ట్ చేశామని వివరించారు. భార్య తన సహాయం కోసం ఆమె చెల్లెలిని ఇంటికి తోడు తెచ్చుకుందని, పనుల్లో సాయపడడానికి వచ్చిన భార్య చెల్లిపై నిందితుడు అత్యాచారం చేశాడన్నారు. మేలో ఒకసారి, సెప్టెంబరులో రెండు సార్లు ఇలా ఆమెపై అత్యాచారం చేశాడని బాధితురాలు వివరించిందన్నారు. ఇతనిపై పోక్సో చట్టంకింద కేసు నమోదు చేసి తాను దర్యాప్తు చేస్తున్నానన్నారు. సీఐ ధనుంజయరావు, ఎస్సై సావిత్రి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ సత్యనారాయణ

పెరుగుతున్న గోదావరి

దేవీపట్నం, న్యూస్‌టుడే: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో గండిపోశమ్మ ఆలయం వద్ద గోదావరి నీటి మట్టం స్వల్పంగా పెరుగుతోంది. మంగళవారం నుంచి బుధవారానికి సుమారు రెండు అడుగుల మేర నీటిమట్టం పెరిగిందని స్థానికులు తెలిపారు. డి.రావిలంక - దండంగి గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రహదారిపై మళ్లీ వరద నీరు చేరడంతో గండిపోశమ్మ ఆలయం వైపునకు తాత్కాలికంగా రాకపోకలు నిలిచాయి. సీతపల్లి వాగుకు నీటి ప్రవాహం పెరుగుతోంది. వరుస తుపానుల కారణంగా పాపికొండల విహార యాత్ర నేటికి ప్రారంభం కాలేదు. గండిపోశమ్మ అమ్మవారి ఆలయానికి భక్తుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. బుధవారం అమ్మవారి ఆలయాన్ని సిబ్బంది శుభ్రం చేశారు. మరో రెండు రోజుల్లో ఆలయం శుద్ధి పనులు పూర్తవుతాయని త్వరలోనే అమ్మవారి దర్శనాలు ప్రారంభం కానుంది.



డి.రావిలంక- దండంగి మధ్య ఆర్‌అండ్‌బీ రహదారిపై వరద నీరు

ప్రతిఒక్కరికీ ఉపాధి పని

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: గిరిజన గ్రామాల్లో జాబ్‌కార్డులున్నవారందరికీ ఉపాధి పని కల్పించాలని ఎంపీడీవో ఎ.వి.వి కుమార్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో క్షేత్ర, సాంకేతిక సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వంద రోజుల పని చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో కుమార్

రోడ్డు మరమ్మతులకు నిధులు

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: రమణయ్యపేట నుంచి జె.అన్నవరం వరకు ర.భ.శాఖ రహదారి అభివృద్ధికి మార్గం సుగమమైంది. కాకినాడ జిల్లా, అల్లూరి సీతారామరాజు జిల్లాలను అనుసంధానం చేసే ఈ రహదారి దాదాపు 13 కిలోమీటర్ల పొడవునా తీవ్రంగా దెబ్బతింది. ఆయా చోట్ల ప్రయాణం ప్రమాదకరంగా మారిందని వివరిస్తూ 'ప్రాణసంకటంగా ప్రయాణాలు' శీర్షికన 'ఈనాడు'లో సోమ, మంగళవారాల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ క్రమంలో ప్రయాణికుల వెతలను తీర్చేందుకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ స్పందించారు. జిల్లా అధికారులతో మాట్లాడి సత్వరమే నిధుల మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరారని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి బుధవారం చెప్పారు. ఏలేశ్వరం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రోడ్డు మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేస్తారని వెల్లడించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: పెదబయలు పీహెచ్‌సీని బుధవారం జిల్లా వైద్యాధికారి జమాల్ బాషా ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, మందుల నిల్వలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. గర్భిణులను ప్రసవానికి ముందే ఆసుపత్రిలో చేర్చాలన్నారు. అనంతరం గోమంగి ఆసుపత్రి సందర్శించారు. వైద్యుడు నిఖిల్, సిబ్బంది పాల్గొన్నారు.

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: మారుమూల గ్రామాల ప్రజలు జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ రాజేశ్ సూచించారు. మండలంలోని తుమ్మిలేరు పోచవరం పంచాయతీ గొందూరు, కొల్లూరు గ్రామాలకు బుధవారం ప్రత్యేక మరపడవలో జీడిగుప్ప వైద్యశాల సిబ్బంది వెళ్లి, ఇంటింటి జ్వరాల సర్వే నిర్వహించారు. కొద్దిపాటి అనారోగ్య సమస్య వచ్చినా వెంటనే వైద్యశాలకు రావాలన్నారు. రెండు గ్రామాల్లో వివిధ రుగ్మతలతో వచ్చిన వారికి ఏఎన్ఎం హరిణికుమారి బృందం వైద్యపరీక్షలు చేసి మందులు అందించారు. ప్రతీ ఇంటికి దోమల నివారణ మందుని పిచికారీ చేయించారు.



కొల్లూరులో రోగులకు పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది



పెదబయలులో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో

గంగవరం: విద్యార్థినులు విధిగా పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని వైద్యాధికారిణి ఒ. భావన అన్నారు. గంగవరం ఆశ్రమబాలికోన్నత పాఠశాలను బుధవారం ఆమె సందర్శించి వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థినులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి ఆరోగ్య విద్యపై అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతో ఉన్నత శిఖరాలు

గంగవరం, న్యూస్‌టుడే: విద్యతో ప్రతి ఒక్కరు ఉన్నత శిఖరాలు అందిపుచ్చుకోవచ్చని ఎస్సై డి.భూషణం, ఎంఈవో టి.మల్లేశ్వరరావు విద్యార్థులకు సూచించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో బుధవారం హెచ్ఎం లక్ష్మి ఆధ్యక్షతన విద్యార్థినులకు మండలస్థాయి చదరంగం, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎంఈవో, ఎస్సై, హెచ్ఎంలు ప్రారంభించారు. పీడీలు నాగమణి, ఆదయ్య, పీఈటీలు రామలక్ష్మి, శేఖర్, పద్మావతి, వార్డెన్ మడకం లావణ్య, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో పోటీలు ప్రారంభిస్తున్న ఎంఈవో, ఎస్సై తదితరులు

25 వరకు ఆధార్ మేళా

రంపచోడవరం, న్యూస్‌టుడే: రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలో ఈ నెల 25వ తేదీ వరకు ఆధార్ మేళా నిర్వహించనున్నట్లు డివిజనల్ డవలప్‌మెంట్ అధికారి కె.కోటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రంపచోడవరం ఐటీడీఏ పరిధి ఏడు మండలాలతోపాటు చింతూరు ఐటీడీఏ పరిధి నాలుగు మండల కేంద్రాలల్లోను ఆధార్ అప్‌డేట్ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. పేర్లు, చిరునామాల మార్పు తదితర అంశాలను ఆధార్ కార్డుదారులు వినియోగించుకోవచ్చన్నారు. వినియోగదారులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తాగునీటి పథకం ప్రారంభం

జి.మాడుగుల, న్యూస్‌టుడే: వంతాల పంచాయతీ తలబరసింగిలో జల్ జీవన్ మిషన్‌లో భాగంగా నిర్మించిన తాగునీటి పథకాన్ని అధికారులు ప్రారంభించారు. రూ. 7.50 లక్షలతో ఈ పథకాన్ని నిర్మించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్ సుమారు నాలుగు కిలోమీటర్ల కాలినడకన గ్రామానికి చేరుకొని ఈ పథకాన్ని ప్రారంభించారు.

మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు

పాడేరు, న్యూస్‌టుడే: గంజాయి, మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దని పాడేరు ఎస్సై సూర్యనారాయణ సూచించారు. బుధవారం స్థానిక వైద్య కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ.. ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ నేరమని పేర్కొన్నారు. అందరూ స్నేహపూర్వకంగా మెలగాలని కోరారు. మాదకద్రవ్యాలు, గంజాయి రహిత సమాజమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. కళాశాలలో యాంటి డ్రగ్స్ కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు.



పాడేరులో వైద్య విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

మోతుగూడెం, న్యూస్‌టుడే: వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్సై శివకుమార్ విద్యార్థులకు మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై బుధవారం అవగాహన కల్పించారు. విద్యార్థులతో ఎస్సై శివకుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో గంజాయి లేకుండా చేయాలనే ఉద్దేశంతో సంకల్పం కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. గంజాయి పండించిన, రవాణా, విక్రయించిన సమాచారం తెలిస్తే వెంటనే 9381123100 ఫోన్ నెంబర్‌కు తెలియజేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచి, వారికి తగిన పారితోషికం అందజేస్తామన్నారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సీఐ నరసింహమూర్తి, విద్యార్థులు

అడ్డతీగల, న్యూస్‌టుడే: గంజాయి, సారా, పొగాకు వంటి మాదక ద్రవ్యాలు వినియోగించడం ఆరోగ్యానికి హానికరమని అడ్డతీగల సీఐ నరసింహమూర్తి అన్నారు. ఎస్సై వినోద్‌తో కలిసి స్థానిక అనూప్ కళాశాల విద్యార్థులకు బుధవారం మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నరసింహమూర్తి మాట్లాడుతూ గంజాయి రవాణా చేయడం, వినియోగించడం చట్ట రీత్యా నేరమన్నారు. పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కళాశాల కరస్పాండెంట్ చీకట్ల ఆశీర్వాదం, విద్యార్థులు పాల్గొన్నారు.

గొలుసు దుకాణాలు నిర్వహిస్తే చర్యలు

చింతపల్లి గ్రామీణం: చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలో ఎక్కడైనా గొలుసు దుకాణాలు నిర్వహించినా, అధిక ధరలకు మద్యాన్ని అమ్మినా చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ కూర్మారావు హెచ్చరించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు మండలాల్లో ఆరు మద్యం షాపులు పొందిన వాహనదారులు ఎట్టి పరిస్థితిల్లోనూ ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయించకూడదన్నారు.

ఇసుక తవ్వకాలపై నిఘా

గొలుగొండ, న్యూస్‌టుడే: వంతెనలు, నీటి పథకాలు, సాగునీటి ఆనకట్టల వద్ద ఇసుక తవ్వకాలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. వీఆర్‌ఓల పర్యవేక్షణలో వంతులవారీగా కాపలా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. రాత్రిపూట తవ్వకాలకు వెళ్లేవారిపై నిఘా ఉంచుతున్నట్లు వెల్లడించారు.

చిన్నారి వైద్యానికి విద్యార్థుల చేయూత

అడ్డతీగల, న్యూస్‌టుడే: అడ్డతీగలకు చెందిన హేమ నవిత కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ విశాఖపట్నం రైన్‌బో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వేటమామిడి హోసన్నా ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం ఆ పాఠశాల యాజమాన్యంతో కలిసి రూ.40వేలు సేకరించి, బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. విద్యార్థులు చేసిన సాయానికి గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.



హేమ కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న విద్యార్థులు

ఎన్నాళ్లో వేచిన ఉదయం

సీలేరు, న్యూస్‌టుడే: మండలంలోని జాజులబందకు స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నాళ్లకు రోడ్డు మంజూరైంది. జాతీయ ఉపాధి హామీ పథకం కింద సీసీ రహదారి నిర్మాణానికి నిధులు మంజురు చేశారు. బుధవారం ఈ పనులకు ఎంపీటీసీ సభ్యుడు, సర్పంచి ఎ.బొంజిబాబు, కె.బొంజిబాబు శంకుస్థాపన చేశారు. గ్రామస్థులు పాల్గొన్నారు.



రహదారి పనులు ప్రారంభిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు, సర్పంచి

అత్యాచారయత్నం కేసులో మూడేళ్ల జైలు

విశాఖ లీగల్, న్యూస్‌టుడే: మానసిక దివ్యాంగ బాలికపై అత్యాచారయత్నం కేసులో యువకుడికి మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.30వేల జరిమానా విధిస్తూ పోక్సో న్యాయస్థానం ప్రత్యేక న్యాయమూర్తి జి.ఆనందిని తీర్పునిచ్చారు. నిందితుడు చెల్లించే జరిమానాను బాధితురాలికి నష్టపరిహారంగా ఇవ్వాలని ఆదేశించారు. పోక్సో న్యాయస్థానం ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం, జె.పి.అగ్రహారానికి చెందిన కాకరదాసు(25) వృత్తిరీత్యా మోటారు మెకానిక్. అదే ప్రాంతానికి చెందిన దంపతులకు మానసిక దివ్యాంగురాలైన కుమార్తె(16) ఉంది. 2014 జులై 7న కాకరదాసు బాలికను మభ్యపెట్టి తన ఇంటికి తీసుకెళ్లి అత్యాచారం చేయబోయాడు. ఈలోపు అతని కుటుంబ సభ్యులు రావడం చూసి బాలికను విడిచిపెట్టాడు. ఇంటికి వెళ్లిన బాలికకు కడుపు నొప్పి రావడంతో ఏడవడం ప్రారంభించింది. ఆమె అమ్మమ్మ ఆరా తీయగా జరిగిన విషయాన్ని సంజ్ఞలతో తెలిపింది. ఈ మేరకు బాధితురాలి కుటుంబ సభ్యులు రోలుగుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడ్ని పోక్సో న్యాయస్థానంలో హాజరుపరిచారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి పైవిధంగా శిక్ష విధించారు.

ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్య

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: నర్సీపట్నంలో పదో తరగతి చదువుతున్న బాలిక (15) బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. నర్సీపట్నం సీఐ గోవిందరావు కథనం ప్రకారం.. శారదానగర్‌లోని బాంబే టైలర్ వీధిలో తల్లిదండ్రులతో కలిసి నివాసం ఉంటున్న బాలిక పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఏడాదిగా మైగ్రేన్‌తో బాధపడుతోంది. మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుంది. సాయంత్రం కుటుంబ సభ్యులొచ్చి చూసేసరికి ముందు గదికి లోపల గడియపెట్టి ఉంది. కిటికీలో నుంచి చూస్తే బాలిక ఉరికి వేలాడుతూ కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. నాతవరం మండలంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ వివరించారు. మరణోత్తర పరీక్షల నిమిత్తం మృతదేహాన్ని నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థి సాయం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: తాజంగి ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థి క్రాంతికుమార్ తన తండ్రి జ్ఞాపకార్థం కంప్యూటర్, ఇతర పరికరాలు అందజేశారు. విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించామని క్రాంతికుమార్ తెలిపారు. విద్యా కమిటీ ఛైర్మన్ మోహనరావు, జనసేన నాయకులు ఉగ్రంగి లక్ష్మణరావు, శంకర్రావు, సత్తిబాబు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



తాజంగి ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్, ఇతర పరికరాలు అందజేస్తున్న క్రాంతికుమార్

ప్రభాస్ జన్మదిన వేడుకలు

ఎటపాక: లక్ష్మీపురంలో సినీ నటుడు ప్రభాస్ జన్మదిన వేడుకలు బుధవారం రెబల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రంబాల కార్తిక్ ఆధ్వర్యంలో పట్టుచీర గ్రామంలోని ఎంపిపి పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్లు అందజేశారు. వాసం రాము, కణితి రాజు, జవ్వల ముధు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	115	110
లైవ్	137	130
డ్రెస్‌డ్	199	230
స్కిన్‌లెస్	226	240

విద్యార్థుల ప్రగతిపై ప్రత్యేక దృష్టి

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థుల ప్రగతిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన వెబెక్స్ సమావేశానికి ఎంఈవోలు విశ్వవిద్యా, సరస్వతిదేవీలతోపాటు ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు. విద్యా సంవత్సరం ప్రారంభించి త్రైమాసికం గడిచిన నేపథ్యంలో విద్యార్థుల ప్రవేశాలు, యూడైస్‌కోడ్ ప్రగతి, మధ్యాహ్న భోజనం తీరు, స్కూల్ కాంప్లెక్సుల నిర్వహణ, పాఠశాల విద్యా కమిటీ పని తీరు, విద్యా ప్రగతి వంటి విషయాలను విద్యాశాఖ కమిషనరేట్ అధికారులు సమీక్షించారు. మధ్యాహ్న భోజనంలో మార్పులపై ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయుల నుంచి సలహాలు తీసుకున్నారు. ప్రధానోపాధ్యాయులు, ఇతర బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ఎంఈవోలు, ఉపాధ్యాయులు



గిరిజన సంఘాల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి

పాడేరు, న్యూస్‌టుడే: గిరిజనుల ఆకాంక్షల మేరకు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామని కలెక్టర్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో పలు గిరిజన సంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... జిల్లా సమగ్రాభివృద్ధికి గిరిజన సంఘాల నేతల సహకారం, సూచనలు అందించాలని కోరారు. పాఠశాల భవనాల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ భూముల, క్వార్టర్ల ఆక్రమణలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావుదొర, మొట్టడం రాజుబాబు, రామకృష్ణ, వరలక్ష్మి తదితరులు మాట్లాడుతూ... ఆశ్రమ పాఠశాలల్లో మెనూ సక్రమంగా అమలు చేయడం లేదని చెప్పారు. డిప్యూటీ వార్డెన్ల పోస్టులకు ఉపాధ్యాయులు పైరవీలు చేస్తున్నారని చెప్పారు. ఎంపీపీ పాఠశాలల ఉపాధ్యాయులు సక్రమంగా విధులకు హాజరుకావడం లేదని ఫిర్యాదు చేశారు. నకిలీ కులధ్రువపత్రాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన సంఘాల ప్రతినిధులు కె.ఆనందరావు, గోపాల్, అశోక్, డాక్టర్ పి.రవికుమార్, సన్యాసిరెడ్డి, కిషోర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ శిబిరాలు మరో రెండు రోజులే..!

మార్పులు చేర్పులు, చిన్నారుల వివరాల నమోదుకు అవకాశం

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే

« గూడెంకొత్తవీధి మండలం పెకేగూడెం గ్రామానికి చెందిన బాలిక జూన్‌లో పాఠశాలలో చేరేందుకు ఆధార్ సమర్పించింది. పేరులో తప్పు ఉండటంతో ప్రవేశం పొందేందుకు ఇబ్బంది ఎదురైంది.

« చింతపల్లి మండలం చౌడుపల్లి గ్రామానికి చెందిన గిరిజనుడు బ్యాంకులో రుణం తీసుకునేందుకు వెళ్లాడు. ఆధార్‌లో ఉన్న వివరాల్లో చిరునామా తప్పుగా ఉండటంతో రుణం మంజూరు కాలేదు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఇతర సేవలకు భారత విశిష్ట ప్రాధికార సంస్థ జారీ చేసిన గుర్తింపు సంఖ్య(ఆధార్) తప్పనిసరి అవుతోంది. ఆధార్‌లో తప్పిదాలు ఉండటంతో పథకాలు, సేవలు అందడం లేదు. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈనెల 22 నుంచి 25 వరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేసింది. ఇవి జిల్లాలో మంగళవారం నుంచి సేవలు అందిస్తున్నాయి.

అల్లూరి జిల్లాలోని 22 మండలాల్లో 352 గ్రామ సచివాలయాల పరిధిలో 9,53,960 మంది జనాభా ఉన్నారు. ఇందులో 92 శాతం మంది ఆధార్ నమోదు చేసుకున్నారు. మిగిలిన 8 శాతం మంది నమోదు చేసుకోవాల్సి ఉంది. వీరిలో అయిదేళ్ల నుంచి పదేళ్లలోపు వయసున్న చిన్నారులే అధికం. వీరితోపాటు ఇప్పటికే ఆధార్ ఉన్న మార్పులు, చేర్పులు చేసుకునేందుకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో 73 ఆధార్ కిట్లు ఉన్నాయి. వీటి ద్వారా మూడు రోజులపాటు ఎంపిక చేసిన సచివాలయాల్లో ఈ సేవలు అందిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోండి



ప్రతి ఒక్కరికి ఆధార్ ఎంతో అవసరం. ఈ సేవలు అందించేందుకు ప్రత్యేక శిబిరాలు అందుబాటులోకి వచ్చాయి. వీటిని సద్వినియోగం చేసుకోవాలి. – ఉమామహేశ్వరరావు, ఎంపీడీవో, గూడెంకొత్తవీధి



ఆధార్ కేంద్రంలో వేలిముద్ర వేస్తున్న విద్యార్థిని

ఏ సేవకు ఎంత రుసుం?

పిల్లలకు సంబంధించి బాల ఆధార్ నమోదుకు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. 5 నుంచి 7 ఏళ్ళ, 15-17 మధ్య బాల బాలికల బయోమెట్రిక్ ఉచితంగా అప్‌డేట్ చేసుకోవచ్చు. జూన్ 1 నుంచి 17 సంవత్సరాలు నిండినవారు వివరాల నవీకరణకు రూ. 100 వసూలు చేస్తారు. ఆధార్‌తో చరవాణి లింక్, ఈ మెయిల్ లింక్, డాక్యుమెంట్లు అప్‌డేట్, పేరు, చిరునామా, పుట్టిన తేదీ, లింగం మార్పు చేసుకోవడానికి రూ. 50 చొప్పున చెల్లించాలి. ఫొటో మార్పునకు రూ. 100 వసూలు చేయాలని ఉన్నతస్థాయి అధికారుల నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

మూగబోయిన బీఎస్‌ఎన్‌ఎల్ సేవలు

పెదబయలు, న్యూస్‌టుడే: పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో రెండు రోజులుగా బీఎస్ఎన్ఎల్ సేవలు మూగబోయాయి. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అంతర్జాల సేవలు అందక విద్యార్థుల వివరాలు పొందుపరిచేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తరచూ ఈ సమస్య ఎదురవుతోందని వినియోగదారులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జీవో నం 3 పునరుద్ధరించాలి

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఆదివాసీల సంక్షేమానికి ప్రవేశపెట్టిన జీవో నెంబరు 3ను పునరుద్ధరించి వంద శాతం ఉద్యోగాలను ఆదివాసీలకే వర్తింపచేయాలని ఆదివాసీ (గిరిజన) ఉద్యోగుల సంక్షేమ, సాంస్కృతిక సంఘం జిల్లా నాయకులు కంగల శ్రీనివాసు, పొడియం పండుదొర, మట్ల కృష్ణారెడ్డి, చవలం శుభకృష్ణ తదితరులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తెదేపా వ్యవస్థాపకులు ఎన్టీఆర్ ఆదివాసీ ప్రాంతాల్లో వంద శాతం ఉపాధ్యాయ, ఉద్యోగాలను స్థానిక ఆదివాసీలతోనే భర్తీ చేయాలని అప్పట్లో ఉత్తర్వులు జారీచేశారన్నారు. ఇటీవల 2020లో సుప్రీంకోర్టు జీవో నెంబరు 3ను కొట్టివేసిందన్నారు. కూటమి ప్రభుత్వం దీనిపై ఆదివాసీలకు తగిన న్యాయం చేయాలని కోరారు. సంఘం ప్రతినిధులు మడకం ప్రసాద్, పండా పవన్, కారం రామన్నదొర, సన్యాసిరెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దేవీపూజ

మోతుగూడెం, న్యూస్‌టుడే: చింతూరు మండలం మోతుగూడెం పంచాయతీ గిరిజన కాలనీలో మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు కాళికాదేవి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజను కాలనీకి చెందిన కాళీదాసు కుటుంబీకులు ఏటా నిర్వహిస్తున్నారు. గ్రామంలోని భక్తులు దేవి విగ్రహానికి పసుపు, కుంకుమ సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కాళీదాసు ఇంటి వద్ద మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. మండల కేంద్రంలో రహదారి పక్కనే పేరుకుపోయిన వ్యర్థాలను తీయించారు. పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, ఈవోపీఆర్డీ పాపారావు పాల్గొన్నారు.

పట్టుదలతో క్రీడల్లో రాణింపు

చింతపల్లి, న్యూస్‌టుడే: గిరిజన విద్యార్థులు పట్టుదలతో క్రీడల్లో రాణించి మన్యానికి మంచి పేరు తీసుకురావాలని కరాటే అసోసియేషన్ స్టూడెంట్ కరాటే క్లబ్ ముఖ్య శిక్షకుడు బాకురు పాండురాజు అన్నారు. చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి తగ్గి ఓంకార్ ఇటీవల రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ -18 అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని ప్రథమస్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఓంకార్‌ను బుధవారం చింతపల్లిలో కరాటే శిక్షకుడు పాండురాజు అభినందించి కొంత నగదు ప్రోత్సాహకంగా అందించారు. చింతపల్లి మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు సైతం కొంత నగదు సాయం చేశారు.

ప్రత్తిపాకలో రీసర్వే చేయాలి

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: ప్రత్తిపాకలో పోలవరం ఆర్అండ్ఆర్ అధికారులు రీసర్వే చేయాలని చిన్నమట్టపల్లి సర్పంచి పిట్టా రామారావు డిమాండ్ చేశారు. మండలంలోని చింతరేవుపల్లిలో బుధవారం ప్రత్తిపాక గ్రామస్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమాయకులైన గిరిపుత్రులకు తక్కువ విలువతో కూడిన పత్రాలు ఇచ్చారన్నారు. ఇళ్లకు ఇంత దారుణంగా విలువలు ఎలా కట్టారన్నారు. కోటం జయరాజు, రమేశ్, రాముడు, లక్ష్మణరావు, కన్నారావు, రవి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు



చినఅంజోడలో 'పొలం పిలుస్తోంది'లో సిబ్బంది, రైతులు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు సాధించాలని సర్పంచి కొములు అన్నారు. కొర్రాయి పంచాయతీ చినఅంజోడలో వ్యవసాయశాఖ అధికారిణి నీలవేణి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ఆయన పాల్గొని మాట్లాడారు. సిబ్బంది సౌయిత, మహేష్ పాల్గొన్నారు.

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: గిరిజన రైతులు సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు అన్నారు. పెదబరడ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గెమ్మెల రమణ, అబ్బాయినాయుడు పాల్గొన్నారు.



శరభన్నపాలెం సమీపంలోని వరి పొలంలో సూచనలు చేస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ ప్రదీప్‌కుమార్

కొయ్యూరు, న్యూస్‌టుడే: పడిపోయిన వరిచేనును కట్టలుగా కట్టి నిలబెట్టాలని డీఏఏటీసీసీ శాస్త్రవేత్త డాక్టర్ పి.బి.ప్రదీప్‌కుమార్ సూచించారు. శరభన్నపాలెం, వెలగలపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా వనరుల కేంద్రం నుంచి వచ్చిన వ్యవసాయ అధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ వరి పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నవంబర్ 15 నుంచి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ఏవో ఉమాదేవి తెలిపారు. ఏఈవో సత్యనారాయణ పాల్గొన్నారు.

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: గుళి పద్ధతిలో సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చని నాబార్డు జిల్లా డీడీఎం చక్రధర్ అన్నారు. డుంబ్రిగుడ మండలం పరిధిలోని లోగిలి, కరబలి గ్రామాల్లో ఆయన పర్యటించారు. గుళి పద్ధతిలో వేసిన సామ పంటలను పరిశీలించారు. వికాస సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా నవచండీ హోమం

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరు మారెమ్మ అమ్మవారి ఆలయంలో బుధవారం నవ చండీ హోమం వైభవంగా నిర్వహించారు. కొవ్వూరులోని అనుసూయ ధార్మిక శక్తి కేంద్రం నిర్వాహకులు, సీలేరు పూర్వ నివాసి సలాది సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. నవచండీ హోమం ప్రాశస్త్యాన్ని పురోహితులు సాయి శర్మ భక్తులకు వివరించారు. అనంతరం పూర్ణాహుతి, అన్నప్రసాద వితరణ జరిగింది.



సీలేరులో హోమం చేస్తున్న పండితులు

బాపనమ్మతల్లి ఆలయ హుండీ లెక్కింపు

రంపచోడవరం, న్యూస్‌టుడే: మండలంలోని సీతపల్లి గడిబాపనమ్మ తల్లి ఆలయంలో బుధవారం జిల్లా దేవదాయశాఖ అధికారి లక్ష్మీసుధారాణి ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు నిర్వహించినట్లు ఈవో గండేపూడి సత్యరమేష్ తెలిపారు. అయిదు నెలలకు రూ. 4,96,535 ఆదాయం వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.



సీతపల్లిలో నగదు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

మన్యంలో మంచుదుప్పటి

మన్యంలో మంచుదుప్పటి పరుచుకుంది. ఉదయం తొమ్మిది గంటల వరకు పొగ మంచు వీడటం లేదు. చుట్టూ పచ్చని కొండల నడుమ మంచు పరచుకుంటోంది. ఈ అందాలను పర్యాటకులు ఆస్వాదిస్తున్నారు. వాహనాలు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.
– డుంబ్రిగుడ, న్యూస్‌టుడే



మంచులో లైట్లు వేసుకుని వస్తున్న జీపు



అరకు-పాడేరు రహదారిలో పెరిగిన తుప్పలు

తుప్పలతో తిప్పలు

అరకు సమీపంలోని బురదగెడ్డ వద్ద అరకు-పాడేరు ప్రధాన రహదారికి ఇరువైపులా తుప్పలు పెరిగి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మలుపులో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదు. రాత్రివేళల్లో ప్రమాదం జరిగే ముప్పు ఉంది. అధికారులు స్పందించి తుప్పలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.
– డుంబ్రిగుడ, న్యూస్‌టుడే

రోడ్డు తవ్వొద్దంటూ రైతుల మొర

కొయ్యూరు, న్యూస్‌టుడే: జాతీయ రహదారి 516-ఈ నిర్మాణంలో భాగంగా డైవర్షన్‌లో వదిలేసిన రోడ్డును తవ్వొద్దంటూ రైతులు మొర పెడుతున్నారు. కాకరపాడు- పిట్టాచలం మధ్యలోని ఓ మలుపులో సుమారు 500 మీటర్ల ఆర్అండ్‌బీ రోడ్డును వదిలేసి జాతీయ రహదారిని నిర్మించారు. మంగళవారం నుంచి దాన్ని తవ్వేస్తున్నారు. ఈ మట్టిని జాతీయ రహదారి నిర్మాణంలో వినియోగిస్తున్నారు. రోడ్డును మూడు నుంచి నాలుగు అడుగుల లోతుకు తవ్వేయడంతో దానిమీదుగా వ్యవసాయ భూములకు వెళ్లే రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే తవ్వకాలు నిలిపేయాలని రైతులు కోరుతున్నారు.



రోడ్డు తవ్వేస్తున్న పొక్లెయిన్

పెదమాకవరం పంచాయతీ రామరాజుపాలెం వంతెన సమీపంలో రైతుల వ్యవసాయ భూములకు వెళ్లేదారి లేకుండా పోతోందని తెలుగురైతు రాష్ట్ర నేత లోతా భీమరాజు అన్నారు. దీనిపై బుధవారం ఆయన తహసీల్దార్ ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ఈనెల 24న చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల పరిధిలో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్తు సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏపీఎన్ఎం అప్పారావు బుధవారం తెలిపారు. నిర్వహణ పనుల నిమిత్తం సరఫరా నిలిపేస్తున్నామన్నారు.

పాడేరు, న్యూస్‌టుడే: పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో ఈనెల 25వ తేదీన ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఎ.వి.ఎన్.ఎం అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో జీఎస్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధి కందుల సాయిబాబా ద్వారా ఊట్ల, రామన్నపాలెం గ్రామాల్లో బుధవారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టరు గోరంట్ల రవిరామ్‌కిరణ్ రోగులకు వైద్యం అందించి మందులు అందజేశారు. ఊట్ల సర్పంచి లక్ష్మి, బూత్ ఇన్‌ఛార్జి కంగల అబ్బాయిదొర, తెలుగు యువత అధికార ప్రతినిధి సాగర వీర వెంకట చిన్నాలు దొర తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: జీకేవీధి మండలంలోని జర్రెల ఘాట్‌రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోయింది. గోతులు పడి వాహనాల రాకపోకలకు వీలు లేకుండా పోయింది. వంచుల, మొండిగెడ్డ సర్పంచులు కాసులమ్మ, ప్రియాంక తమ సొంత నిధులు వెచ్చించి బుధవారం జేసీబీతో రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

విశాఖపట్నం, న్యూస్‌టుడే: రాష్ట్రీయ ఏక్ పర్వ్, ఏక్ భారత్, శ్రేష్ఠభాతర్ కళా ఉత్సవం-2024 వేడుకలు బుధవారం 104 ఏరియా శ్రీవిజయనగర్ కేంద్రీయ విద్యాలయం-2లో ముగిశాయి. హైదరాబాద్ రీజియన్ పరిధి ఆంధ్ర, తెలంగాణకు చెందిన సుమారు 300 మంది విద్యార్థులు, 70 మంది ఉపాధ్యాయులు హాజరైనట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ అంశాల్లో ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

తెదేపా సభ్యత్వ నమోదుపై దృష్టి

చింతూరు, న్యూస్‌టుడే: పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై నాయకులు దృష్టి సారించాలని తెదేపా నియోజకవర్గ పరిశీలకుడు చెల్లబోయిన శ్రీనివాసరావు పేర్కొన్నారు. చింతూరు తెదేపా మండల అధ్యక్షుడు ఇల్లా చిన్నారెడ్డి గృహంలో బుధవారం నాలుగు మండలాల నాయకులతో సభ్యత్వ నమోదు సన్నాహక కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతం కంటే అధిక సంఖ్యలో సభ్యత్వాలు నమోదు చేసేందుకు నాయకులు కృషి చేయాలని వివరించారు. సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు బీమా సౌకర్యం ఉంటుందని తెలిపారు. ఈ బీమా ఉన్న కుంజా దూలమ్మ మార్చి 11న ప్రమాదంలో మృతి చెందటంతో పార్టీ నుంచి రూ. రెండు లక్షలు బీమా మొత్తం అందించారు. ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, తెలుగు యువత అధ్యక్షుడు మఠం భాస్కర్, నాయకులు ఆచంట శ్రీనివాస్, పుట్టి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేస్తున్న తెదేపా పరిశీలకుడు, ఎమ్మెల్యే

కొయ్యూరు, న్యూస్‌టుడే: రూ. వంద సభ్యత్వంతో రూ.ఐదు లక్షల బీమా సదుపాయాన్ని కల్పించిన ఘనత తెదేపాకే దక్కుతుందని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి టి.దొరబాబు అన్నారు. కొండగోకిరిలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలన్నారు. బూత్ ఇన్‌ఛార్జి ఏలూరి రత్నం, యూనిట్ ఇన్‌ఛార్జి లోతా సింహాచలం, పి.వెంకటేశ్వర్లు, ఆర్.అఖిల్ పాల్గొన్నారు.



చింతపల్లి సమావేశంలో మాట్లాడుతున్న తెదేపా మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు

చింతపల్లి, న్యూస్‌టుడే: ఈనెల 26 నుంచి తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, లక్ష్యానికి మించి నమోదు చేపట్టాలని ఆ పార్టీ చింతపల్లి మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు అన్నారు. బుధవారం చింతపల్లి మండల కేంద్రంలో తెదేపా ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. మండలంలో 10 వేల సభ్యత్వాలు నమోదు చేయించాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. నాయకులు లక్కోజు నాగభూషణం, పెదిరెడ్ల బేతాళుడు, రీమల ఆనందరావు, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు మంజూరు చేయండి

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: పీఎం జన్‌మన్‌లో భాగంగా పీవీటీజీ గిరిజనులు నిర్మించుకుంటున్న గృహాల బిల్లులను సకాలంలో చెల్లించాలని దామనాపల్లి సర్పంచి కుందెరి రామకృష్ణ కోరారు. డేగలపాలెంలో గృహాల నిర్మాణాన్ని బుధవారం ఆయన పరిశీలించారు.

జీతాల చెల్లింపులో తీవ్ర జాప్యం

ఎటపాక, న్యూస్‌టుడే: రాష్ట్ర సంఘం పిలుపు మేరకు మండలంలోని మూడు పీహెచ్‌సీల పరిధిలోని 108 సిబ్బంది బుధవారం ఇక్కడ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఈఎంఎస్ సంస్థ నిర్వహణ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి జీతాల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. రెండు నెలల నుంచి జీతాలు చెల్లించలేదని, దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. రోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చేపడుతున్నామని, ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను త్వరగా పరిష్కరించాలని వీరంతా కోరుతున్నారు..



నెల్లిపాకలో 108 సిబ్బంది నిరసన

మేమున్నాం.. మీకు తోడుగా..

పాడేరు 89853 66570, అరకులోయ 63034 86346, రంపచోడవరం 94908 77172

రంపచోడవరం, న్యూస్‌టుడే

?: రంపచోడవరం నుంచి పెదగెద్దాడ వెళ్లే ప్రధాన రహదారిలో ఇరువైపుల తుప్పలు పెరిగిపోయాయి. దీంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
– నీలాపు సూరిబాబు, రంపచోడవరం.

✓: రంపచోడవరం నుంచి పెదగెద్దాడ వరకు రోడ్డుకిరువైపుల పెరిగిన తుప్పలు తొలగించేందుకు చర్యలు చేపడతాం.
– ప్రదీప్, ఏఈ, ర.భ.శాఖ, రంపచోడవరం.



మారేడుమిల్లి, న్యూస్‌టుడే

?: మారేడుమిల్లిలోని మండల పరిషత్ కార్యాలయం పక్క నుంచి ప్రధాన రహదారిని కలిపే వీధి రోడ్డు అధ్వానంగా ఉంది. వర్షం పడితే బురదమయంగా మారి, ప్రజలు నడవడానికి కూడా వీలు లేకుండా మారిపోతుంది. – కృష్ణ, మారేడుమిల్లి

✓: మండల పరిషత్ కార్యాలయం పక్క నుంచి ప్రధాన రహదారికి వెళ్లే వీధి రోడ్డును సిమెంటు రహదారిగా నిర్మించడానికి అవసరమైన చర్యలు చేపడతాం. ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తాం.– వెంకటరమణ, మండల ఇంజినీరింగ్ అధికారి, మారేడుమిల్లి

?: దుకాణాల నుంచి వచ్చే వ్యర్థాలను మారేడుమిల్లి నుంచి రంపచోడవరం వెళ్లే ప్రధాన రహదారి పక్కనే పారేస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఈ మార్గంలో ప్రయాణించే వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. – రాజన్నదొర, మారేడుమిల్లి

✓: ఎటువంటి వ్యర్థాలను వేయకుండా తగిన చర్యలు చేపడతాం. బాటసారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం. – విజయ్‌కుమార్, ఈవోపీఆర్డీ

ఎమ్మెల్సీ ఓటు నమోదు గడువు 6 వరకు



మాట్లాడుతున్న కార్యదర్శి కన్నారావు

కూనవరం, న్యూస్‌టుడే: అర్హులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటుహక్కును విధిగా వినియోగించుకోవాలని యూటీఎఫ్ మండల కార్యదర్శి పాయం కన్నారావు అన్నారు. ఎమ్మార్సీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటు నమోదు సమయం వచ్చే నెల ఆరు వరకు గడువు ఉన్న నేపథ్యంలో ఇప్పటివరకు ఓటు నమోదు చేసుకోని వారు వెంటనే నమోదు చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో పట్టభద్రులు, ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలన్నారు. నాగేశ్వరరావు, రాంబాబు, సీత, మహతి, నాగదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ భద్రతపై అవగాహన

సింధియా, న్యూస్‌టుడే : తూర్పు నౌకాదళం పరిధి అన్ని నేవల్ యూనిట్లలో సైబర్ భద్రతపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు బుధవారం నేవీ వర్గాలు తెలిపాయి. 'జాతీయ సైబర్ భద్రత అవగాహన మాసం-2024' నేపథ్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నాయి. సైబర్ రెడీ ఫోర్స్, సేఫ్ గార్డింగ్, డిజిటల్ సీస్ వంటి అంశాలపై నిపుణులు సూచనలు చేస్తున్నారని స్పష్టం చేశాయి. సైబర్ పీస్ ఫౌండేషన్ సహకారం అందిస్తున్నట్టు వెల్లడించాయి.

నూతన అధికారుల బాధ్యతల స్వీకరణ



కొయ్యూరు, న్యూస్‌టుడే: కొయ్యూరు నూతన ఎస్సైగా పి.కిశోర్‌వర్మ బుధవారం బాధ్యతలు చేపట్టారు. శ్రీకాకుళం జిల్లా నౌపడలో పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇటీవలే ఇక్కడ నియమితులైన నాగార్జున మళ్లీ ఎటపాకకు వెళ్లిపోయారు. కొయ్యూరు, మంప ఎస్సైలు కిశోర్ వర్మ, శంకరరావులను భాజపా మండల అధ్యక్షుడు అప్పలరాజు, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎ.రాజు, ఉపాధ్యక్షుడు చంద్రరావు, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.చక్రరావు తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

ఎంపీడీవో ప్రసాద్



కొయ్యూరు, న్యూస్‌టుడే: కొయ్యూరు ఎంపీడీవోగా ఎస్కేవీ ప్రసాద్ నియమితులయ్యారు. గత వారంలో ఎంపీడీవోగా బి.రమేష్‌నాయుడు బాధ్యతలు చేపట్టి ఆ వెంటనే సెలవుపై వెళ్లిపోయారు. ఈవోఆర్డీగా విధులు నిర్వహిస్తున్న ప్రసాద్‌ని ఎంపీడీవోగా నియమించి పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా పరిషత్ సీఈవో ఉత్తర్వులు జారీ చేశారు.

ఆర్ఐగా జగ్గయ్యమ్మ



అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: అనంతగిరి ఆర్ఐగా పంచాడి జగ్గయ్యమ్మ బాధ్యతలు స్వీకరించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.

వెలుగు ఏపీఎంగా సూర్యారావు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: వెలుగు గూడెంకొత్తవీధి మండల ఏపీఎంగా సూర్యారావు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏపీఎంగా పనిచేసిన ఈశ్వరరావు విశాఖపట్నం బదిలీ అయ్యారు.

ఏఈఈగా కల్యాణ్

చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల తాగునీటి సరఫరా విభాగం ఏఈఈగా కల్యాణ్ బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లా నుంచి ఈయన బదిలీపై వచ్చారు. ఇటీవల బదిలీ అయిన గూడెంకొత్తవీధి ఏఈఈ భగవంతరావు స్థానంలో ఈయన నియమితులయ్యారు.